
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 18 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా.6.22
సహరీ (మంగళ) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	26

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- నేటి నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు
- జిల్లాలో 112 కేంద్రాలు
- నో మొబైల్ జోన్లుగా ప్రకటన
- 21,113 మంది విద్యార్థులు
- 1,230 మంది ఇన్విజిలేటర్లు
- ప్రశ్నపత్రానికి క్యూఆర్ కోడ్
- వేసవి నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. జిల్లాలో 21,113 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందుకు గాను 112 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు 9 గంటలకల్లా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు



వన్నెచింతలపూడి జడ్పీ హైస్కూలులో ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



తలెత్తకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించామన్నారు. మొబైల్‌తో పాటు ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ప్రతి ప్రశ్నపత్రానికి ఒక క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ప్రశ్నపత్రాలను కేంద్రాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచామన్నారు. పూర్తి బందోబస్తు నడుమ ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తరలించడం, పరీక్షల అనంతరం జవాబు పత్రాలను తరలించే విధంగా పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేసవి నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, తాగునీటితో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

పరీక్షల నిర్వహణకు జిల్లాలో 1,230 మంది ఇన్విజిలేటర్లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు 12 మంది రూట్ అధికారులను నియమించామన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో బి-కేటగిరీలో 61, సి-కేటగిరీలో 51 కేంద్రాలను గుర్తించామన్నారు.సి-సెంటర్లలో



అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి జడ్పీ హైస్కూలులో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్సు సెంటర్లను మూసి వేయాలని ఆదేశాలిచ్చామన్నారు. 112 పరీక్షా కేంద్రాలకు గాను ప్రతి కేంద్రం వద్ద ఒక్కో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు అధికారి ఉంటారన్నారు. వీరు కాక మరో 14 మంది అదనపు డిపార్టుమెంట్ అధికారులు ఉంటారన్నారు.

విద్యార్థుల ఇష్టాలను తల్లిదండ్రులు గుర్తించాలి

భవిష్యత్తులో విద్యార్థులు ఏవిధమైన కోర్సులు చదవాలనుకుంటున్నారో గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులు మాత్రమే కాకుండా ఎన్నో కోర్సులు ఉన్నాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని తల్లిదండ్రులు కోరుకోవడంలో తప్పులేదని, అయితే వారిపై ఎటువంటి ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో ఎన్నో వినూత్నమైన కోర్సులు అందుబాటులోకి వచ్చాయని, వాటిల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటున్నాయని వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పదో తరగతి పరీక్షల్లో సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏపీవోఎస్ఎస్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి తెలిపారు.

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 2,10,907 మంది ఓటర్లు

- రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి



అమలాపురం టౌన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాలు జారీ అయ్యాయని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో గండ్లూరి కేశవర్ధనరెడ్డి ఆదివారం తెలిపారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు 235 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 2,10,907 మంది ఓటర్లకు గాను 1,05,173 మంది పురుషులు, 1,05,733 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు. అమలాపురంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికల మెటీరియల్ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశామని, కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో రిసెప్షన్, స్ట్రాంగ్ రూములతో పాటు ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి లిఖితపూర్వకమైన ఆదేశాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు మినహా రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా తాత్కాలికంగా మూసివేయాలని అధికారులకు ఆర్డీవో స్పష్టం చేశారు.

ఎన్నికల కోడ్‌తో 'స్పందన' రద్దు

అమలాపురం టౌన్, మార్చి 17: భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 'స్పందన' జరగదని కలెక్టరేట్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నంత కాలం 'స్పందన' ఉండదన్నారు. అర్జీదారులు ఈ అంశాన్ని గుర్తించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా డివిజన్, మండల, గ్రామ సచివాలయ స్థాయిల్లో కూడా 'స్పందన'ను ఎన్నికల దృష్ట్యా నిర్వహించట్లేదని ఆ ప్రకటనలో వివరించారు.

మాకు జీతాలెప్పుడు సారూ!

వేతనాల కోసం గృహ నిర్మాణ శాఖ అధికారుల ఎదురుచూపులు

అమలాపురం రూరల్, మార్చి 17: మార్చి నెలలో ఇప్పటికే 17 రోజులు గడిచిపోయాయి. గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి మాత్రం ప్రభుత్వం ఇంతవరకూ జీతాలు విడుదల చేయలేదు. అసలు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్లకు మాత్రం జీతాలను చెల్లించారు. కానీ రెగ్యులర్ ఉద్యోగులకు, ఇతర సిబ్బందికి జీతాలు విడుదల చేయలేదు. గత కొంత కాలంగా ఇదే పరిస్థితి నెలకొంది. జీతాలు సకాలంలో విడుదల కాకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నామని ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది వాపోతున్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి ముసుగా!



అమలాపురం టౌన్, మార్చి 17: స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఎన్నోసార్లు జైలుకు వెళ్లిన మహనీయుడాయన. భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను గుర్తించి ఆమరణ దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ముసుగులు వేయడం ఏమిటని సర్వత్రా చర్చ జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అమరజీవి విగ్రహాలకు ముసుగులు వేసేశారు. ఎన్నికల కోడ్‌కు పొట్టి శ్రీరాములుకు సంబంధం ఏమిటని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం పట్టణంలోని పొట్టిశ్రీరాములు సర్క్యులర్ బజార్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహంతో పాటు బండారులంకలోనూ ఆయన విగ్రహాలకు శనివారం జయంతి నిర్వహించి దండలు వేశారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో ఆ దండలు తీసేసి మరీ ముసుగు వేశారు.

ఇటుక బట్టీ వద్ద లంక మట్టి నిల్వలు



అప్పనపల్లి కాజ్‌వే వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ



లంక మట్టి కొల్లగొట్టి!

- మామిడికుదురు మండలంలో అనధికార ఇటుక బట్టీల జోరు
- ముడుపుల మత్తులో చూసీచూడనట్టు అధికారులు
- కాలుష్య కోరల్లో గ్రామాలు, రోగాల బారిన ప్రజలు

మామిడికుదురు, మార్చి 17: జిల్లాలో ఇటుక బట్టీలను అనధికారికంగా ఏర్పాటు చేయడంతో పలు గ్రామాలు కాలుష్యం బారిన పడుతున్నాయి. అక్రమార్కులు లంక మట్టిని కొల్లగొట్టి ఇటుక బట్టీలు ఏర్పాటుచేసి సొమ్ము చేసుకుంటున్నారు. వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. ప్రధానంగా మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, నగరం, పెదపట్నం, పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం, డీఎస్ పాలెం, యర్రంశెట్టివారిపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా-కోనసీమ సరిహద్దు ప్రాంతాల్లోను, అయినవిల్లిలంక నదీ తీర ప్రాంతాల్లో అనధికార ఇటుక బట్టీలు ఏర్పాటుచేసి లంక మట్టిని కొల్లగొట్టి వ్యాపారాలు చేస్తూ కోట్లు గడిస్తున్నారు. ప్రధాన రహదారి చెంతనే ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటుక బట్టీ ఉన్నచోట పక్కనే రోడ్లపై కలపను నిల్వ ఉంచడం వల్ల రాత్రివేళలో అవి కనిపించక పలు ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. గత ఆగస్టులో వరదల సమయంలో వరద తీవ్రతను పరిశీలించడానికి వచ్చిన కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అప్పనపల్లి కాజ్‌వే పక్కన పాటురేవులో ఏర్పాటుచేసిన ఇటుక బట్టీలను పరిశీలించి వాటిపై ఆరా తీశారు. వరదల సమయంలో నదీ ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఇటుక బట్టీలను తక్షణం తొలగించాలంటూ అప్పట్లో రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి నోటీసులు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. అయినా అక్కడ ఇటుక బట్టీలు నేటికీ కొనసాగుతుండడం అధికారుల తీరుకు అద్దంపడుతోంది. బి.దొడ్డవరంలో జనావాసాల మధ్య ఇటుక బట్టీల నిర్వహణపై అభ్యంతరం తెలుపుతూ డివిజన్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటుక బట్టీలను వెలిగించే సమయంలో వెలువడే ధూళి, దుమ్ము, పొగ వల్ల శ్వాస ఆడక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని స్థానికులు, ప్రయాణికులు చెప్తున్నారు. ప్రభుత్వభూములు, లంక గ్రామాల్లోని జిరాయితీ భూముల్లో లంక మట్టిని అనుమతి లేకుండా రాత్రి సమయంలోను, ప్రభుత్వసెలవు దినాల్లోను తవ్వి ఇటుక బట్టీల వారికి అమ్ముకుని స్థానిక మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగా ఇటుకలను తయారుచేసి వేసవి కాలంలో ఎక్కువ రేటుకు అమ్ముకుని బట్టీల నిర్వాహకులు భారీగా లాభాలు ఆర్జిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, పంచాయతీ, డ్రెయిన్స్, మైనింగ్, పోలీసు శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా అనధికార బట్టీలపై దాడులు చేసిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నెలవారీగా అందేముడుపులతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. అంతేగాక ఇటుక బట్టీల్లో బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, కార్మిక చట్టాలు అమలు కావట్లేదని, బట్టీల్లో పనిచేసే కార్మికులకు సరైన రక్షణ సౌకర్యాలు కల్పించట్లేదని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఇష్టారాజ్యంగా ఇసుక బట్టీలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



బి.దొడ్డవరంలో జనావాసాల మధ్య ఇటుక బట్టీ



అప్పనపల్లిలో ప్రభుత్వ స్థలంలో దర్జాగా తయారు చేసిన ఇటుకలు



బి.దొడ్డవరంలో రోడ్డు పక్కనే అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీ

వలస ఓటర్ల వేటలో...

- హైదరాబాద్ మియాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనం
- కూకట్‌పల్లిలోని ముమ్మిడివరం నియోజకవర్గ ఓటర్లతో టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమావేశం

ముమ్మిడివరం, మార్చి 17: ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం తెలంగాణలో వున్న ఓటర్లకు గేలం వేసే ప్రయత్నాలకు టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముమ్మిడివరం మండలానికి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి బుచ్చిబాబు, టీడీపీ నాయకులు

చెందిన సుమారు ఐదు వేల మంది ఓటర్లు వున్నట్టు సమాచారం. దీంతో వారిని కలిసి ఓట్లు అభ్యర్థించేందుకు ఆదివారం బుచ్చిబాబు మియాపూర్‌లోని సప్తపది ఫంక్షన్ హాలులో భారీ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 3వేల మంది యువకులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, మోకా ఆనంద్‌సాగర్, గొలకోటి దొరబాబు, మందల గంగసూర్యనారాయణ, తాడి నరసింహారావు, చెల్లి అశోక్ వంటి ముఖ్య నాయకులు, సీనియర్ పాత్రికేయుడు నడింపల్లి సీతారామరాజు కూడా హాజరయ్యారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక తిరోగమన పరిస్థితిని తెలియజేశారు. గత ఐదేళ్లలో సాఫ్ట్‌వేర్ రంగం సంక్షోభంలో కూరుకుపోవడంతో ఉద్యోగాలు, ఉపాధి కరువై యువతీ, యువకులు రోడ్డునపడ్డారని, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, అవినీతి, అక్రమాలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని బుచ్చిబాబు అభ్యర్థించారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటామని సమ్మేళనానికి వచ్చిన వారంతా స్పష్టం చేశారు. అనంతరం మోటారు సైకిళ్లపై భారీ ర్యాలీ నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ చిప్పలపాలేనికి చెందిన యువసైన్యం ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్టు సమాచారం.



కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠ ఆదివారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులకు పుష్కర నదీ జలాలతో అభిషేకం, ప్రధాన హోమం, మహా పూర్ణాహుతి, స్వామివారికి జీవకళావాహన, వేద ఆశీర్వచనంలను వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. వేలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు.... 7లో





తొడగొడుతున్న యువతి..



పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం



ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు



ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట





ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు



ఉత్సాహంగా యువతులు..



బాబు,పవన్, పురందేశ్వరి అభివాదం...



మోదీతో బాబు మాటామంతీ..



జానపదుల నృత్యాలు..



మహిళలు, కార్యకర్తల ఉత్సాహం...





వాడపల్లిలో ఘనంగా స్వర్ణ శిఖర ప్రతిష్ఠ



ఆత్రేయపురం, మార్చి 17: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠ ఆదివారం కన్నుల పండువగా జరిగింది. శ్రీవారి ఆలయంతో పాటు క్షేత్ర పాలకులైన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారి ఉపాలయాలకు స్వర్ణ కలశ ప్రతిష్ఠ జరిగింది. వైఖానస ఆగమం ప్రకారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం 10.22 గంటలకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు భక్తుల గోవింద నామస్మరణ మధ్య నిర్వహించారు. ప్రధాన హోమం, మహా పూర్ణాహుతి, స్వామివారికి జీవకళావాహన, పుష్కర నదీ జలాలతో అభిషేకం, వేదాశీర్వచనం జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో రూ.35 లక్షల వ్యయ దాతలు తాడి నాగమోహనరెడ్డి, మేడపాటి సిద్ధార్థరెడ్డి, చిర్ల వాసురెడ్డి, ధర్మకర్త పి.సురేష్‌రాజు, ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు.



శిఖర ప్రతిష్ఠకు తరలివచ్చిన భక్తులు

202 కిలోల గంజాయి పట్టివేత

రావులపాలెం, మార్చి17: జాతీయ రహదారిపై వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రావులపాలెం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారిపై ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఎస్‌ఐలు ఎం.ప్రేమ్‌కుమార్, జ్వాలాసాగర్ కానిస్టేబుళ్లు పి.విజయకుమార్, గోపి, త్రిమూర్తులు, శ్రీనివాస్‌లతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న ఏపీ 02 ఏడీ 3887 మహేంద్ర జైలో వాహనాన్ని ఆపి చూడగా అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయి, కారు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిసా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కెందుగూడ గ్రామానికి చెందిన దమా కొంతేరి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంహరాస్ గ్రామానికి చెందిన సతీష్‌విశ్వాస్ 202 కిలోల గంజాయి తరలిస్తున్నట్టు నిర్ధారించారు. గంజాయి విలువ రూ.10 లక్షలు, వాహనం విలువ రూ.2.50 లక్షలుగా పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



గంజాయి నిందితులతో పోలీసులు

రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు



విజేతకు షీల్డ్ అందిస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం రూరల్, మార్చి 17: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్లపరుగు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ షీల్డులు బహూకరించారు. సీనియర్స్ విభాగంలో అనకాపల్లి జిల్లా లెక్కలవాని పాలానికి చెందిన పైడితల్లి అమ్మ తల్లికి చెందిన ఎడ్లజత నిర్దేశించిన దూరాన్ని 6 నిమిషాల 21 సెకన్ల సమయంలో పరుగెత్తి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, మండపేట వేగుళ్ల తేజ ఎడ్ల జత 6-33-15 సమయంలో, గుమ్మిలేరు కోరా వీర వెంకట సత్యవేణి ఎడ్లజత 6-37-69 సమయంలో పరుగెత్తి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా వీరవెంకట సత్యవేణి ఎడ్లజత 4-36-28 సమయంలో, యర్రంపాలెంకు చెందిన ఇజ్జిన శ్రీను ఎడ్లజత 4-37-56, కొప్పవరం బండారు శ్రీను మెమోరియల్ ఎడ్లజత నిర్దేశిత దూరాన్ని 4-38-13 సమయంలో పరుగెత్తి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి

కిర్లంపూడి, మార్చి17: బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. కిర్లంపూడి ఎస్‌ఐ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం సామర్లకోట నుంచి కిర్లంపూడికి బైక్‌పై కిర్లంపూడి రమణయ్యపేటకు చెందిన వార్డు మెంబర్ ముత్తా పెదకాపు రెండో కుమారుడు హరిసాయివెంకటఅప్పారావు(20), జగపతినగరం కొత్తపేటకు చెందిన పొలిమేరు వెంకటేష్(20) వస్తున్నారు. వారు రాజుపాలెం వచ్చేసరికి బొలెరా వ్యాన్ ఢీకొట్టడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. హరిసాయిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జబీర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేష్ మృతదేహం



ముత్తా హరిసాయి | పొలిమేరు వెంకటేష్

బైక్‌లను ఢీకొన్న కారు: యువకుడి మృతి



గంగాధర్ | ఫైల్‌ఫొటో

ప్రత్తిపాడు, మార్చి17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు- ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతిచెందగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామానికి చెందిన తాడి గంగాధర్(నవీన్)(29), తాడి రాజేష్, గుడాల సురేష్ ఒక బైక్‌పైన, గొల్లప్రోలు మండలం వెల్దుర్తికి చెందిన అన్నదమ్ములు ములికి సత్యనారాయణ, ములికి ఉమాశంకర్ మరో బైక్‌పైన ప్రత్తిపాడు వస్తుండగా తిరుమల రెస్టారెంట్ వద్ద విజయవాడ వెళుతున్న కారు రెండు బైక్‌లను ఢీకొంది. ఈ దుర్ఘటనలో తాడి గంగాధర్ మృతి చెందగా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ఇల్లు కట్టుకుందామని వచ్చి

హైదరాబాద్‌లో మందుల కంపెనీలో పని చేస్తున్న తాడి గంగాధర్ (నవీన్) తన స్వగ్రామం ఉత్తరకంచిలో ఇల్లు నిర్మించుకుందామని వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాడ పడ్డాడు. గంగాధర్‌కు భార్య సుధారాణి, పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారమైన గంగాధర్ ఇలా మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు షాక్‌కు గురై పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.

మరో ప్రమాదంలో

ధర్మవరం పాడికాలువ వద్ద జాతీయ రహదారిపై ధర్మవరం నుంచి కత్తిపూడి వైపు బైక్‌పై వెళుతున్న బి.లక్ష్మి, బి. రాజేష్, బి. వైష్ణవిని లారీ ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం అంబులెన్స్‌ల్లో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎటపాక, ఏప్రిల్ 17 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కన్నాయి గూడెం వద్ద ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలతో పాటు తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే వాహనాలను సీఐ రామారావు, ఎస్‌ఐ పార్థసారథి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు తరలిస్తున్నారనే దానిపై సోదాలు జరిపారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. నెల్లిపాక వద్ద హైవేపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 17: గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి గ్రామంలో వేంచేసి ఉన్న అపర్ణాదేవికి ఆదివారం లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. కుంకుమార్చనకు మహిళా భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు జరిపించారు. ఉదయం సూర్యనారాయణమూర్తికి అభిషేకం, అర్చన నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి రాగి డాలర్, శేషవస్త్రం, పూజా కుంకుమ, ప్రసాదం అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర హోమం, మహా సౌరహోమం ఘనంగా జరిగింది. కాగా స్వామి, అమ్మవార్లను పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ప్రధాన కార్యవర్గ సభ్యుడు దాసం వెంకటేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గోదావరిలో మునిగి పారిశుధ్య కార్మికుడి మృతి



నవీన్‌సాగర్

రాజమహేంద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి ఓ పారిశుధ్య కార్మికుడు దుర్మరణం చెందాడు. రాజ మహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న తాడితోట రెల్లిపేటకు చెందిన నిమ్మకాయల నవీన్ సాగర్(35) ఆదివారం సాయంత్రం పూజా సామగ్రి గోదావరిలో కలపడానికి పుష్కరఘాట్‌కు వెళ్లాడు. గోదావరిలో కాస్త లోతుకు వెళ్లగా ఫిట్స్ రావడంతో మునిగి చనిపోయి ఉంటాడని త్రీటౌన్ పోలీసులకు అతడి సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య గౌడ్ తెలిపారు.

శాశ్వత విద్యా సహాయనిధికి రూ.88,116 విరాళం

అమలాపురం రూరల్, మార్చి 17: శ్రీకోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్య సహాయ నిధికి విరాళాల సేకరణలో భాగంగా బండారులంక కాపటివీధి, వీరభద్రపురం ప్రాంతాల్లో ఆదివారం పర్యటించగా దాతలు రూ.88,116 విరాళంగా కోనసీమ సంఘ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అందజేశారు. సంఘ నాయకులు పిచ్చిక శ్యామ్, జాన గణేష్, చింతపట్ల గంగాసత్యనారాయణ, ఇనుమర్తి లింగమూర్తి, పిల్లి పల్లపురాజు, యినుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగింపు

కె.గంగవరం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగిస్తున్నట్టు తహసీల్దార్ రవీంద్రబాబు తెలిపారు.

నరసాపురపుపేటలో చెక్‌పోస్టు ఏర్పాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి17: పట్టణంలో విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు, బ్యానర్లను ఆదివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కొన్ని రాజకీయ పక్షాలు స్వచ్ఛందంగా ఫ్లెక్సీలు తొలగించగా మిగిలినవి మున్సిపల్ సిబ్బంది తొలగించారు. నరసాపురపుపేటలో ఆదివారం పోలీసు, రెవెన్యూ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు, తహసీల్దార్ వెంకటేశ్వరరావులు చెక్‌పోస్టును పరిశీలించి సూచనలు చేశారు. చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు.

ముక్కామలలో వాహనాల తనిఖీ

అంబాజీపేట, మార్చి 17: ముక్కామల సెంటర్‌లో అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కార్లు, మోటార్‌సైకిల్‌తో పాటు అనుమానం ఉన్న వ్యక్తులను తనిఖీ చేశారు.

వెంకన్న ఆదాయం రూ.2.77లక్షలు

ఆత్రేయపురం, మార్చి 17: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,77,011 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి17: స్థానిక లక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

టీడీపీ నేతలను కలిసిన సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 17: టీడీపీ రామచంద్రపురం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రామచంద్రపురం పట్టణంలో పలువురు టీడీపీ నాయకులను కలిశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమరిన వీర్రాజు, మహిళా విభాగం నాయకురాలు జాస్తి విజయలక్ష్మీ తదితరులను కలిశారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి సహకరించాలని కోరారు.

రూ.5వేలు ఆర్థిక సాయం

అంతర్వేది, మార్చి 17: అంతర్వేదికి చెందిన సాగిరెడ్డి విశాక్ భాస్కర్‌ఇందీవర్ కంటి ఆపరేషన్ నిమిత్తం ఆదివారం జనసేన నాయకులు రూ.5వేలు అందించారు.

'వేసవి వినోదం' సన్నాహక సమావేశం

అమలాపురం టౌన్, మార్చి 17: అమలాపురం ఎంప్లాయీస్ హోంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో వేసవిలో విద్యార్థులకు నిర్వహించే వేసవి వినోదం-వికాసం కార్యక్రమాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందస్తు ప్రణాళికల్లో భాగంగా రిసోర్సుపర్సన్లు, వలంటీర్లుగా వివిధ విభాగాల్లో అనుభవజ్ఞులైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకునేందుకు నిర్ణయించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.మురుగేశ్వరరావు, చంద్రకళ, జేవీవీ అధ్యక్షుడు జె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖ్వాజా మొహిద్దీన్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ హమీదున్నీసా, టి.నాగవరలక్ష్మి, అబ్బులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక



మండపేట, మార్చి 17: టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు సారథ్యంలో స్థానిక 10,14వ వార్డులకు చెందిన సూది దుర్గారావు, యాదగిరి వీరేంద్ర, పినిశెట్టి రాజు, గంటి గోపికృష్ణ, గారపాటి జానకిరామ్ తదితరులు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీఎన్‌టీయూసీ అధికారప్రతినిధి వాదా ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు తరలిన కూటమి నాయకులు






అమలాపురం: వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంఆర్ శేఖర్, మండపేట: జెండా ఊపుతున్న వేగుళ్ల జోగేశ్వరరావు, రావులపాలెం:ప్రజాగళం సభకు బయలుదేరిన ఉమ్మడి పార్టీల నాయకులు

చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రజాగళం సభకు జిల్లా నుంచి తరలిన నాయకులు

అమలాపురం టౌన్, మార్చి 17: చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వాహనాలను జనసేన అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో జనసైనికులు, వీర మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో ప్రజాగళం సభకు వెళ్లారు.

మామిడికుదురు: చిలకలూరిపేట ప్రజాగళం సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మామిడికుదురు నుంచి మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వర్ధినేని బాబ్జి, నాయకులు సూదా బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, ఉండ్రు శ్రీరామారావు, దొంగ సత్తిబాబు, అప్పారి వెంకటేశ్వరరావు, కోలా రాంబాబు, సాపే ఏకాదశి తరలివెళ్లారు.

మలికిపురం: చిలకలూరిపేట టీడీపీ, జనసేన, బీజేపీ సభకు మలికిపురం నుంచి భారీ సంఖ్యలో వాహనాల్లో తరలివెళ్లారు. మలికిపురం నుంచి టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు సమకూర్చిన వాహనాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్లారు.

మండపేట: చిలకలూరిపేట టీడీపీ, జనసేన,బీజేపీ ఉమ్మడి ప్రజాగళం సభకు మండపేట నియోజకవర్గం నుంచి భారీసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. బస్సులు, కార్ల యాత్రకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. నియోజకవర్గానికి చెందిన మూడు పార్టీల నుంచి వెయ్యి మంది వెళ్లారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, జనసేన నాయకుడు శెట్టి రవి, కౌన్సిలర్ కాశిన కాశి విశ్వనాథం, కర్రి తాతారావు, వల్లూరి వీరబాబు, గుండు తాతరాజు, అల్లూరి రామకృష్ణచౌదరి, బొజ్జా వెంకటేశ్వరరావు తరలివెళ్లారు.



మామిడికుదురు: ప్రజాగళం సభకు వెళుతున్న టీడీపీ మండల నాయకులు

అల్లవరం: బొప్పూడిలో జరిగిన ప్రజాగళం సభకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. నార్గన శ్రీనివాస్, కొల్లు విష్ణుమూర్తి, రాసూరి రాంబాబు, మంతెన సురేష్‌రాజు, మామిడిశెట్టి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం నుంచి ప్రజాగళం సభను విజయవంతం చేయడానికి మూడు పార్టీల మండల అధ్యక్షులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, మాలే శ్రీనివాసనగేష్, కౌరు శ్రీను, పోతురాజు కృష్ణ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఉండపల్లి అంజి, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రజాగళం సభకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు చిన్నకార్లు, బస్సుల్లో తరలివెళ్లారు. పార్టీ పతాకాలతో అలంకరించిన వాహనాల్లో యువత ఉత్సాహంగా బొప్పూడి పయనమయ్యారు. ప్రజాగళంతో వైసీపీ అవినీతి పాలనకు చరమగీతం పాడతామని నినాదాలు చేశారు.

రావులపాలెం: ప్రజాగళంసభకు రావులపాలెంలోని టీడీపీ కార్యాలయం నుంచి ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కొత్తపేట అభ్యర్థి బండారు సత్యానందరావు సారథ్యంలో వాహనాల్లో బొప్పూడి బయల్దేరారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అంబాజీపేట, మార్చి 17: మండలంలో జరిగే పదో తరగతి పరీక్షలకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట, తొండవరం, పుల్లేటికుర్రు హైస్కూల్స్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈమూడు కేంద్రాల్లో ప్రభుత్వ హైస్కూల్స్ నుంచి 431మంది, ప్రైవేట్ స్కూళ్ల నుంచి 91మంది పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించినట్లు తెలిపారు.

కపిలేశ్వరపురం: అంగర, కపిలేశ్వరపురంజడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 8జడ్పీ ఉన్నత, 3ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ మూడు కేంద్రాల్లో 474మంది రెగ్యులర్ విద్యార్థులు, 32 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఎంఈవో కె.తాతారావు తెలిపారు.

మండపేట: సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు. మండలంలోప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1011మంది, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు789మంది పరీక్షలు రాస్తారన్నారు. వీరిలో బాలురు 939మంది, బాలికలు 861మంది ఉన్నారన్నారు. మండలంలో 8పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

అల్లవరం: పదో తరగతి పరీక్షలకు అల్లవరంలో రెండు, కొమరగిరిపట్నం, దేవగుప్తం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు తెలిపారు. 635 మంది రెగ్యులర్, 95మంది ప్రైవేటు... మొత్తం 730మంది పరీక్షలు రాయనున్నారు. గోడి గురుకుల బాలుర పాఠశాల నుంచి 46 మంది, గోడి బాలికల గురుకుల పాఠశాల నుంచి 77మంది పరీక్షలు రాయనున్నట్టు ప్రిన్సిపాల్స్ ఎస్.శ్రీనివాస్, ఎస్.కిరణ్మయి తెలిపారు.

పౌష్టికాహార అవగాహన సభ

మలికిపురం, మార్చి17: ప్రతీ మహిళ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు పూనుకోవాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. విశ్వేశ్వరాయపురంలో సర్పంచ్ చెల్లుబోయిన హెలీన అధ్యక్షతన జరిగిన పోషకాహార అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్లు ప్రసన్నరాణి, హైమావతి, సరోజిని, స్థానిక తల్లుల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి శాస్త్రీయ దృక్పథమే ఆయువుపట్టు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్, మార్చి 17: సమాజం మరింత అభివృద్ధి చెందేందుకు శాస్త్రీయ దృక్పథమే ఆయువుపట్టుగా నిలుస్తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఐఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జేవీవీ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ వేమన, కందుకూరి వీరేశలింగం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనల్లో శాస్త్రీయ దృక్పథం మెండుగా ఉంటుందని వివరించారు. గ్రామ స్థాయి నుంచి జేవీవీలను బలోపేతం చేయడం ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథానికి బాటలు వేసేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల22న ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని దశ దిన ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయన్నారు. 'జల సంరక్షణ-ప్రాముఖ్యత, మన బాధ్యత' అంశాన్ని పర్యావరణ శాస్త్రవేత్త కె.మృత్యుంజయరావు వివరిస్తారన్నారు. తొలుత జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా మొహిద్దీన్ వేసవిలో నిర్వహించే వేసవి వినోదం కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. జిల్లా ఉపాధ్యక్షులు జనిపల్లి సత్యనారాయణ, కోలా వెంకటేశ్వరరావు, చెకుముకి కన్వీనర్ ఎన్.అబ్బులు, కార్యదర్శులు పీవీవీ ప్రసాద్, జి.ఈశ్వరరావు, నాగమణి పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

పి.గన్నవరం, మార్చి 17: గంటి పెదపూడిలో సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి వాహనచోదకులకు పలు సూచనలు చేశారు. మండలంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.శివకృష్ణ, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ఎన్నికలకోడ్ అమలుతోనగరంఎస్ఐ పి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు నగరం గ్రామంలోని ఓఎన్జీసీ ఎదురుగా 216జాతీయ రహదారిపై వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో రాజకీయ నాయకుల, ప్రైవేటు వ్యక్తుల ఫ్లెక్సులను పంచాయతీ సిబ్బంది తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.



పి.గన్నవరం: గంటి పెదపూడిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలి

అమలాపురంరూరల్, మార్చి17: ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతిని అధ్యాపకులు తమ బోధనలో సమన్వయం చేసుకుని విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలని బీవీసీ విద్యా సంస్థల చైర్మన్ బోనం కృష్ణసతీష్ పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన రెండు రోజులు జరిగిన అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. అధ్యాపకులు బోధనలో తీసుకోవలసిన జాగ్రత్తలు, జీవన ఆనందాలను పెంపొందించుకునే విధానాలను వివరించారు. విద్యార్థుల మనోస్థితిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా అధ్యాపకులు బోధనా శైలిని తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభావశీలమైన బోధనా విధానాలను డీన్ డాక్టర్ టీవీ జనార్దనరావు వివరించారు. కౌన్సిలింగ్, గైడెన్స్ సెల్ అధికారి డాక్టర్ శ్రీపాద రామకృష్ణ మాట్లాడుతూ సమాజ గమనం అధ్యాపకుల ప్రవర్తన శైలితోనే ముడిపడి ఉంటుందని వివరించారు. అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సైకాలజిస్టులు డాక్టర్ జి.విజయభాస్కర్, డాక్టర్ చేతనాహారిక, మేరీ అనుపమ వివరించారు. డాక్టర్ ఎంసీఎస్ మదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ బోనం కృష్ణసతీష్

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రావులపాలెం, మార్చి17: రావులపాలెంలో శ్రీఅలమేలుమంగ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, పూజలు జరిపారు. పెద్ద శేష వాహనోత్సవం నిర్వహించారు. గోవింద మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలమూరు, మార్చి 17: పెదపళ్లలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నూతన శిలా విగ్రహాల ప్రతిష్ఠ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వైఖానస వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో పలువురు వేదపండితులు ప్రతిష్ఠా మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు.

'రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో బీజేపీ ఓటమి ఖాయం'

మండపేట, మార్చి17: కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీ జనసేన, బీజేపీ కూటమితో పాటు వైసీపీని రాష్ట్ర ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ప్రజలకు పిలుపు నిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రజలక ఇచ్చిన ప్రత్యేకహోదా హామీ ఏమైందని పీఎం మోదీని ప్రశ్నించారు. 22మంది ఎంపీలను ప్రజలు గెలిపిస్తే సీఎం జగన్ కేంద్రం వద్ద మోకరిల్లారని ఆరోపించారు. ఎస్సీలు,బీసీలకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతీ కుటుంబానికి రూ.లక్ష అందజేస్తామన్నారు. దేశంలో40లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి మాచవరపు శివన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

ద్రాక్షారామ, మార్చి17: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌జంగా గౌతమ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వ పార్టీ బీజేపీని గద్దెదించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అనైతికమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ బూత్ ఏజెంట్లు ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాచవరపు శివన్నారాయణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆర్ఖీఖాన్, మల్లవరపు ప్రకాష్ పాల్గొన్నారు.

హరిమనోవికాస కేంద్రం వ్యవస్థాపకుడు అశోక్ మృతి



అమలాపురం టౌన్, మార్చి 17: మానసిక దివ్యాంగులకు సేవలందించే లక్ష్యంతో ఈదరపల్లిలో మూడు దశాబ్దాల కాలంగా హరి మనోవికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్న సల్లాబత్తుల అశోక్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ పేర్కొన్నారు. అశోక్ స్వగ్రామం సామర్లకోటలో జరిగిన అంతిమ సంస్కారాలకు సురేష్‌తో పాటు అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు, జిల్లా దివ్యాంగుల ఐక్య వేదిక జేఏసీ చైర్మన్ పెనుమాల నాగరాజు హాజరయ్యారు. జేఏసీ సభ్యులు కొప్పాడి నాగరాజు, జనిపెల్ల సంపత్‌కుమార్, కొసన సుబ్రహ్మణ్యం, నిమ్మకాయల సురేష్, సుంకర రాజు, గంటా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: మాయ
వెంకటరమణ	: వెయ్ దరువెయ్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్ర్కీన్-1	: తంత్ర
శేఖర్ స్ర్కీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: భీమా
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: భీమ

కులతత్వ పార్టీలను ఓడించాలి: రుషి

ముమ్మిడివరం, మార్చి 17: రానున్న ఎన్నికల్లో మతతత్వ, కులతత్వ పార్టీలను ఓడించాలని భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం రుషి పిలుపునిచ్చారు. ఆదివారం ముమ్మిడివరంలోని జైబుద్ధ పార్కులో జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞాన ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో ఎన్ఎం రుషి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థిగా విశ్రాంత న్యాయమూర్తి దడాల రామకృష్ణను పార్టీ అధిష్టానం నిర్ణయించినట్టు రుషి ప్రకటించారు. అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా గిడ్డి జ్ఞానప్రకాష్‌ను సమావేశం ఎన్నుకుంది. సమావేశంలో ఐళ్ల సత్యనారాయణ, చీకురుమిల్లి శ్రీనివాస్, పెనుమాల సుధీర్, బుడితి శరత్, బాలయోగి, సకిలే పృథ్విరాజ్, మోకా బాలయ్య, చీకురుమెల్లి చిరంజీవి, ఈవీవీ సత్యనారాయణ, యలమంచిలి సురేష్, పంతడ నరసింహమూర్తి, బడుగు సత్యనారాయణ, చిరంజీవి మోర్తధన కాసులు, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

యానాం, మార్చి 17: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి కేంద్ర ఎన్నికల శాఖ షెడ్యూల్ ప్రకారం మొదటి దశలో ఏప్రిల్19న ఎన్నికలు జరుగుతాయని యానాం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. యానాం సరిహద్దుల్లో 10చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామన్నారు. రూ.50 వేలకు మించి నగదు యానాం ప్రాంతంలోకి తీసుకురావాలంటే ఆధారాలు ఉండాలన్నారు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు ప్రచారాలకు అను మతించినట్లు తెలిపారు. యానాంలో 33పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తా మన్నారు. నియోజకవర్గంలో 39,383మంది ఓటర్లు ఉన్నారని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నియామవళి అమలులో ఉన్నందన వాటికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్యటన

యానాం, మార్చి17: యానాం నియోజకవర్గంలో పుదుచ్చేరి సీఎల్పీ లీడర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వి.వైద్యనాథన్ ఆదివారం పర్యటించారు. రెండు రోజుల పర్యటనకు యానాం వచ్చిన ఆయన కాంగ్రెస్ పార్టీ యానాం ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దినేష్ నేతృత్వంలో యానాంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కనకాలపేట డంపింగ్‌యార్డును పరిశీలించారు. పరిపాలనాధికారి మునిస్వామితో సమావేశమై తాగు, సాగునీటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. యానాం ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వాడపాలెం విద్యార్థులు



కొత్తపేట, మార్చి17: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వాడపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 9మంది ఎంపికైనట్టు స్వామివివేకానంద యోగాశ్రమం గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. వారికి గురువుతో పాటు బండారు సందీప్, శ్రీకాకుళపు వీరబాబు అభినందనలు తెలిపారు.

తోటను కలిసిన శెట్టిబలిజ సంఘీయులు

మండపేట, మార్చి17: వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులును మండపేటకు చెందిన శెట్టిబలిజ సంఘీయులు ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కలిసి సంఘీబావం ప్రకటించారు. 14వ వార్డులో ఈనెల25న జరిగే రామాలయ ప్రతిష్ఠకు రావాలని ఆహ్వానించారు. శెట్టిబలిజ సంఘ నాయకులు చొల్లంగి గోవిందు. పెంకే గంగాధర్, పలివెల నాగేశ్వరరావు, చొల్లంగి సూరిబాబు, సూరంపూడి సత్యప్రసాద్, కుక్కల శ్రీనివాస్, కాదా శ్రీను, మేడిశెట్టి శ్రీనివాస్, దాసరి సత్తిబాబు, పిల్లి శ్రీను పాల్గొన్నారు.

మట్టి లారీలు అడ్డుకుని ధర్నా



మామిడికుదురు, మార్చి 17: పెదపట్నంలో అనధికారికంగా మట్టిని తరలిస్తున్న లారీని అడ్డుకుని గ్రామస్తులు ఆదివారం ధర్నా చేశారు. పి.గన్నవరం మండలం మానేపల్లిలంకలోని మట్టిని అక్రమంగా తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారని ఆరోపించారు. అనధికార మట్టి తవ్వకాలను నిలుపుదల చేసి తమ గ్రామం మీదుగా మట్టి తరలింపును అరికట్టాలని గ్రామస్తులు కోరారు. కొమ్ముల నందిబాబు, కట్టా సుబ్రహ్మణ్యం, గుబ్బల పండు, కోడేటి శంకరం, బొక్కా చిన్నా, కాజులూరి కిరణ్, కడలి భానోజీప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం



మామిడికుదురు, మార్చి 17: బి.దొడ్డవరంలో వీరభద్ర స్వామి సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, భజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ వైనతేయ నది వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శమీపూజ, అష్టోత్తర పూజ, శూలాల సంబరాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి 60గజాల పొడవు కలిగిన నిప్పుల గుండాన్ని స్వామివారి భక్తులు తొక్కారు. ఈపూజలు పినిశెట్టి వెంకటస్వామి, వెంకట్రామారావు ఆధ్వర్యంలో జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం

రాయవరం, మార్చి 17: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈవో వై.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి రాయవరం వివేకానంద స్కూల్ 15వ వార్షికోత్సవం నిర్వహించారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత చదువు, ఆటపాటల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానంద స్కూల్ డైరెక్టర్ బీపీఏ సరోజిని, పాఠశాల చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు సీహెచ్ శైలూష, సీహెచ్ వికాష్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్టు సాయం అందజేత

ముమ్మిడివరం, మార్చి 17: స్థానిక బాలయోగి కాలనీకి చెందిన కుంచే రాజేష్, జనిపల్లి సత్యనారాయణ, శామ్యూల్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చారు. వారికి రూ.100కిలోల బియ్యం, రూ.7వేల నగదును ప్రజాహిత చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎస్ఎన్.మునీశ్వరరావు అందజేశారు. నాగాబత్తుల సత్యనారాయణ, పెట్టా రమేష్, గుత్తాల శ్రీనివాస్, జంగా బాబి, జంగా మురళీ పాల్గొన్నారు.

సీఎం జగన్ సభ వాయిదా

రావులపాలెం, మార్చి 17: రావులపాలెంలో మంగళవారం జరగాల్సిన సీఎం జగన్ సభ వాయిదా పడినట్టు వైసీపీ నేతలు తెలిపారు. ఎన్నికలకు ఎక్కువ వ్యవధి ఉండడంతో ఈనిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన




చినపేటలో రక్షిత మంచినీటి పథకానికి వైసీపీ రంగు
పేరవరం పంచాయతీ వద్ద వైఎస్ విగ్రహానికి ముసుగు వేయని దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చినా మండలంలోని వివిధ గ్రామాల్లో అధికార పార్టీ నాయకుడి ఫ్లెక్సీలను ఇంకా తొలగించలేదు. తాడిపూడి వంతెనకు వైసీపీ రంగులు, ఆత్రేయపురం చిన్నపేటలో రక్షిత మంచినీటి పథకానికి వేసిన అధికార పార్టీ రంగులు అలాగే దర్శనమిస్తున్నాయి. పేరవరం పంచాయతీ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేయలేదు.

ఫ్లెక్సీలను తొలగించని అధికారులు



కె.పెదపూడి సెంటర్‌లో తొలగించని అధికార పార్టీ ఫ్లెక్సీ

అంబాజీపేట, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కొన్ని చోట్ల ఇంకా ఫ్లెక్సీలను తొలగించలేదు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయలేదు. ఆర్‌బీకే కేంద్రాలపై రంగులతో వేసిన ఫొటోలు ఇంకా అలానే ఉన్నాయి. కె.పెదపూడి రావులమ్మ ఆలయ సమీపంలో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేసి పక్కన ఉన్న అధికార పార్టీ ఫ్లెక్సీని తొలగించలేదు. కొందరు నాయకులు ఇళ్ల వద్ద లైటింగ్ బోర్డులతో ఏర్పాటుచేసిన అధికార పార్టీ నేతల ఫ్లెక్సీలను అలాగే ఉంచారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

రాయవరం, మార్చి 17: వెంటూరులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. కురకాళ్లపల్లికి చెందిన మేడిశెట్టి శ్రీను(42) వెంటూరు వస్తుండగా ఎదురుగా వస్తున్న తొట్టి ఆటో ఢీకొట్టడంతో గాయపడ్డాడు. శ్రీను కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కె.గంగవరం, మార్చి 17: యండగండికి చెందిన కె.శ్రీనివాసు 14మద్యం సీసాలు విక్రయిస్తుండగా అరెస్టు చేసినటు ఎస్ఐ జానీ బాషా చెప్పారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నాటు సారా స్వాధీనం

పి.గన్నవరం, మార్చి 17: ముంగండపాలెం శివారు గాజులగుంట గోరింకల డ్రెయిన్ వద్ద ఎస్ఐ బి.శివకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పది లీటర్ల నాటు సారా, సారా తయారీకి వినియోగించే గ్యాస్ సిలిండర్, సామగ్రి స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

లంక గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాల కవాతు

కపిలేశ్వరపురం, మార్చి 17: లంకగ్రామాలు అద్దంకివారిలంక, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంకలో ఆదివారం మండపేట సీఐ శ్రీధర్ పర్యవేక్షణలో అంగర ఎస్ఐ ఎ.పరదేశి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు పోలీస్ కవాతు నిర్వహించాయి. కేదార్లంకలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.